
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
ఆదివారం 1 సెప్టెంబరు 2024





Sunday SPECIAL

మట్టి గణపతికి జైహో..

- మట్టి వినాయక విగ్రహాల వైపు జనం ఆసక్తి
- నవరాత్రి ఉత్సవాల్లో కొలువుదీరనున్న మట్టి గణపతులు
- 'ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు'కి పెరుగుతున్న ఆదరణ
- నగరంలో పెద్దఎత్తున విగ్రహాల తయారీ
- అందుబాటు ధరల్లో అన్ని చోట్ల అమ్మకానికి సిద్ధం
- ఎల్లమ్మబజార్‌లో తొలిసారి 40 అడుగుల భారీ మట్టి విగ్రహం

5

వరంగల్ ఎల్లమ్మబజార్‌లో తొలిసారిగా రూపుదిద్దుకుంటున్న 40 అడుగుల భారీ మట్టి విగ్రహం

నవరాత్రుల సందడి ప్రారంభం కాబోతోంది. తొమ్మిది రోజులు పూజలు, భజనలు, ప్రసాదాలు, అన్నదానాలతో ప్రతీ వాడ, పల్లె అధ్యాత్మిక శోభ సంతరించుకోనున్నది. ఈ క్రమంలో మట్టి విగ్రహాలను వినియోగించుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు హాని కలిగిస్తున్న నేపథ్యంలో 'ఎకో ఫ్రెండ్లీ గణపయ్య'ను ప్రతిష్ఠించుకోవాలని కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా నగరంలో పెద్దఎత్తున మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. వివిధ ఆకృతులు, రంగులతో ఆకర్షణీయంగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇందుకోసం పల్లెల్లో పొలాల్లోని మట్టిని, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచు, కర్రలను ఉపయోగించి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కాగా, నగరంలోని ఎల్లమ్మబజార్‌లో 40 అడుగుల అతిపెద్ద మట్టి విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తర్వాత వరంగల్‌లో పెద్దదైన విగ్రహం ఏర్పాటు చేయనుండడం గమనార్హం.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

నెరవేరిన 'పీహెచ్‌డీ' కల

- ఎట్టకేలకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు
- న్యాయపరమైన సమస్యలు రాకుండా అప్రమత్తత
- అన్ని విభాగాల్లోనూ విద్యార్థుల జాయినింగ్
- ఆనందోత్సాహాల్లో అభ్యర్థులు

వివరాలు 5వ పేజీలో...

విస్తరిస్తున్న వ్యసనం

ఆంధ్రా టు తెలంగాణ గంజాయి రవాణా

- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో జోరుగా దందా
- ఇప్పటికే 50 కిలోలకుపైగా పట్టివేత
- నియంత్రణకు చెమటోడుస్తున్న పోలీసులు
- అయినా కళ్లుగప్పి జోరుగా వ్యాపారం



ఇటీవల భూపాలపల్లి పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

భూపాలపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వ్యసనం నలుదిక్కులా విస్తరిస్తోంది. యువతరం మత్తుకు బానిస అవుతోంది. గంజాయికి భూపాలపల్లి, ములుగు జిల్లాలు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ముఖ్యంగా 16 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు దీని బారిన పడి జీవితాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. శారీరకంగా, మానసికంగానే కాకుండా ఆర్థికంగా కుంగిపోతున్నారు. యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఈ దందాకు అడ్డుకట్ట పడటం లేదు.

కన్నబీస్ జాతికి చెందిన గంజాయి సాగు ఇక్కడ లేకపోయినప్పటికీ పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మన జిల్లాల్లోకి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నట్లు పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఎక్కువగా సాగుతోంది. అక్కడి ప్రభుత్వం గంజాయి వినియోగంపై ఉక్కుపాదం మోపుతుండటంతో స్మగ్లర్లు రూటు మార్చి తెలంగాణ జిల్లాలను లక్ష్యంగా చేసుకొని ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రెండేళ్లుగా ఈ అక్రమ రవాణా జోరందుకుంది. వివిధ సందర్భాల్లో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనం. 2020 నుంచి గంజాయి వినియోగం క్రమంగా పెరుగుతున్నట్లు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో గుర్తించింది. అప్పట్లో మాదక ద్రవ్యాల నిరోధానికి సంబంధించి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను హెచ్చరించినా పెడ చెవిన పెట్టడంతో ప్రస్తుతం గంజాయి దందా విస్తరించుకుంటూ పోతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా కొన్ని ముఠాలు గంజాయి దందాను సాగిస్తుండగా మరికొన్ని ముఠాలు మహారాష్ట్రలోని గడ్చిరోలి కేంద్రంగా జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో ఈ అక్రమ వ్యాపారం విస్తరించడం వెనుక బడా బాబుల హస్తం కచ్చితంగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్మగ్లర్లు గ్రామ స్థాయి వరకు నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని దర్జాగా గమ్య స్థానాలకు సరుకును చేరుస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు పోలీసు యంత్రాంగం గంజాయి నియంత్రణకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ముఠాలను పట్టుకునేందుకు చెమటోడుస్తున్నా స్మగ్లర్లు కళ్లుగప్పి ఈ వ్యాపారాన్ని విస్తరించుకుంటూ పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. గడిచిన నెలరోజుల వ్యవధిలో ములుగు, భూపాలపల్లిల్లో సుమారు 50 కేజీల గంజాయి పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం.

రూ. 2 వేలకు తెచ్చి.. రూ. 5 వేలకు విక్రయం

దొడ్డిదారిన పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న గంజాయిని 50, 100 గ్రాముల ప్యాకెట్లుగా విభజించి విక్రయాలు జరుపుతున్నారు. వీటిని ఎక్కువగా ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే విద్యార్థులే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల్లో గంజాయి సాగు చేసే రైతుల నుంచి కిలోకు వెరైటీని బట్టి రూ. 2,200 మొదలుకొని రూ.3వేల వరకు కొనుగోలు చేసి ఇక్కడ 100 గ్రాములకు రూ.500 చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల భూపాలపల్లి, కాటారం, గణపురం, మహదేవపూర్ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో పట్టుబడిన గంజాయి కిలోల్లో లభ్యమైనప్పటికీ ఇదంతా చిన్నచిన్న ప్యాకెట్లుగా విభజించి ఉండటం గమనార్హం. వీటిని ఎక్కువగా వలస కూలీలను రవాణాకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బీహార్‌కు చెందిన ముఠాలు ఈ దందాలో యాక్టివ్‌గా పని చేస్తున్నాయని పోలీసులు భావిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 16 గంజాయి కేసులు నమోదయ్యాయి. ఇందులో 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.5 లక్షల 50 వేలు ఉండొచ్చని ప్రాథమికంగా తేల్చారు. అలాగే ఈ కేసుల్లో మొత్తం 47 మందిని అదుపులోకి తీసుకొని జైలుకు పంపించారు. అయినప్పటికీ గంజాయి రవాణా, వినియోగం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లు మరింత కోరలు చాస్తుండటం పోలీసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు



కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 31 : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర త్రివేణి సంగమ గోదావరిలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆఖరి శనివారం కావడంతో భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శని త్రయోదశి కావడంతో కాళేశ్వరంతో ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకమైన నవగ్రహ, కాలసర్ప దోష, కుంకుమ పూజలు, కాళేశ్వర ముక్తీశ్వరస్వామి మహారుద్రాభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆలయానికి ఒకరోజు ఆదాయం రూ.3.60 లక్షలు వచ్చిందని అధికారులు తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌కు సహకరించాలి

జిల్లా జడ్జి సూర్యచంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సూర్యచంద్రకళ

ములుగు, ఆగస్టు 31: ములుగులోని జిల్లాకోర్టు ఆవరణలో సెప్టెంబరు 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా అన్ని శాఖల అధికారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్య చంద్రకళ కోరారు. కోర్టులో ఆవరణలో పోలీస్, ఫారెస్ట్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి కన్నయ్యలాల్, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జె.సౌఖ్య, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి రామ్మోహన్‌రెడ్డి, పీపీలు పి.రవికిరణ్, బి.శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ములుగు డీఎస్పీ రవీందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి

మంత్రి సీతక్కకు అంగన్‌వాడీల వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 31: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు శనివారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో పెట్టడంలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, సరోజన, పద్మారాణి, ధనలక్ష్మి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు, బీజేపీ నాయకులు

కాటారం, ఆగస్టు 31: మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఆటో డ్రైవర్లు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ధర్మసాగర్ గ్రామానికి చెందిన సతీష్ శుక్రవారం తన ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్తుండగా గంగారం గ్రామానికి చెందిన మహిళ సైతం ఎక్కిందని, కొద్ది దూరం వెళ్లిన అనంతరం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆటోను తనిఖీ చేయగా ఆమె వద్ద గుడుంబా లభ్యమైందన్నారు. దీంతో గుడుంబాను స్వాధీనం చేసుకున్న అధికారులు ఆటోను సీజ్ చేశారని తెలిపారు. డ్రైవర్ సతీష్‌కు గుడుంబాతో సంబంధం లేకున్నా ఆటోను సీజ్ చేశారని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్క మోహన్‌రావు, రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, దుర్గం తిరుపతి సంఘీభావం తెలిపారు. అత్యుత్సాహం ప్రదర్శించిన ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. సమస్యను ఎక్సైజ్ ఉన్నతాధికారులకు వివరించి, న్యాయం చేకూరేలా కృషి చేస్తామని అన్నారు. దీంతో ఆటో డ్రైవర్లు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బక్కయ్య, రాజయ్య, రవి, సమ్మయ్య, నానయ్య, రాజు, సతీష్, బీజేపీ నాయకులు సంపత్, తిరుపతిరెడ్డి, బాపురెడ్డి, అర్జయ్య, మోహన్‌రెడ్డి రమేష్, వేణు, లాకూనాయక్, కాంగ్రెస్ నాయకులు పసుల మొగిలి, కొట్టె ప్రభాకర్, భూపెల్లి రాజు, గడ్డం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ శ్రీజ బదిలీ

ములుగు, ఆగస్టు 31: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ బదిలీ అయ్యారు. ఖమ్మం అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీజ గత ఏడాది డిసెంబరులో ములుగు అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె బదిలీ కాగా ఖాళీ అయిన ఈ స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

రెడ్ అలెర్ట్

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షం
- ఏజెన్సీ మండలాల్లో కుండపోత
- జాతీయ రహదారిపైకి చేరిన వరద
- అప్రమత్తమైన అధికారులు



ములుగు మండలం సర్వాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బొగ్గులవాగు

ములుగు/కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 31: ములుగు, భూపాలపల్లి జిల్లాలకు వాతావరణశాఖ శనివారం రెడ్ అలెర్ట్ జారీ చేసింది. రాగల 24గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈక్రమంలో రెండు జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. ములుగు జిల్లా తాడ్వాయి, గోవిందరావుపేట, వాజేడు, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. వరదనీరు 163వ జాతీయ రహదారిపైకి చేరింది. జిల్లాకేంద్రంలో కోర్టు ఎదుట వరద ఆగడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తాడ్వాయి మండలంలోని జనగలంచ కాజ్‌వే వద్ద రహదారిపై వరద పోటెత్తడంతో రెండు గంటలపాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పస్రా సమీపంలో చెట్టు కూలిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సెప్టెంబరు 1 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఏటూరునాగారం ఐటీడీఏ, ములుగు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేసింది. అత్యవసర సాయం కోసం 6309842395, 08717-293246, 18004257109 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ దివాకర సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చెరువులు, కుంటలు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లొద్దని సూచించారు. రాగల 48 గంటలు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరారు.

ములుగు జిల్లాలో 57.9మి.మీ వర్షపాతం

ములుగు జిల్లాలో 57.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మంగపేట మండలంలో 93.6మిల్లీమీటర్లు, గోవిందరావుపేటలో 83.8, ఏటూరునాగారంలో 81.6, వెంకటాపురం(నూగూరు)లో 67.8, వెంకటా పూర్ (రామప్ప)లో 51, తాడ్వాయిలో 48.4, ములుగులో 47.2, కన్నాయి గూడెంలో 26, వాజేడులో 22.4మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

అప్రమత్తమైన భూపాలపల్లి అధికారులు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. శనివారం సాయంత్రం 3 గంటలకే మేఘాలు కమ్ముకుని సుమారు అరగంట పాటు కుండపోత వర్షం పడింది. కాటారం మండలం గోపాల్‌పూర్‌లో వర్షానికి పెంకుటిల్లు కుప్పకూలింది. వరద ప్రవాహానికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేలల్లోకి వరద నీరు చేరింది. మల్లారం పెద్దవాగు ఉప్పొంగడంతో దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలో పత్తి చేలల్లోకి వరద నీరు చేరడంతో నష్టం వాటిల్లింది. మల్హర్ మండలం తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, కొయ్యూర్‌తో పాటు పలు గ్రామాల్లో పత్తి, వరి పొలాల్లోకి వరద నీరు చేరింది. భారీ వర్షానికి తాడిచర్ల వద్ద మానేరు నది ప్రవాహం పెరిగింది. మల్లారం వద్ద ఆరెవాగు ప్రవాహం పెరిగింది. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు భారీ వర్షానికి విరిగి పడింది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

30 మి.మీ వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా శనివారం 30.0 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. మహదేవపూర్‌లో 15.4, పలిమెలలో 48.4, మహాముత్తారం 30.2, కాటారం 29.4, మల్హర్ 39.2, చిట్యాల 27.6, టేకుమట్ల 24.2, మొగుళ్లపల్లిలో 30.2, రేగొండలో 36.8, గణపురం 12.0, భూపాలపల్లిలో 37.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు వివరించారు.

హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో 9030632608, 18004251123 నంబర్లపై సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక వర్షాల దృష్ట్యా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండొద్దని, అధికంగా ప్రవహించే వాగులు దాటొద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

పీడిత ప్రజలే గద్దర్ వారసులు

గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి సూర్యకిరణ్

వడ్డెపల్లి, ఆగస్టు 31: దేశ పీడిత ప్రజల విముక్తి కోసం తుది వరకు పోరాడిన ప్రజా యుద్ధ నౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్‌కు నిజమైన వారసులవుతారని గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్ అన్నారు. గద్దరన్న విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ జిల్లా చైర్మన్ కోండ్ర నర్సింగరావు అధ్యక్షతన శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన గద్దర్ ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి త్యాగపూరిత పోరాటం చేసిన గద్దర్ విగ్రహాలను, స్మృతి వనాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గద్దరన్న స్ఫూర్తితో చెట్టు, పుట్టతో మమేకమై జీవిస్తున్న ఆదివాసీల రక్షణ కోసం, అణగారిన ప్రజల హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు.

తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. గద్దరన్న ప్రతీ మాటలో, ప్రతీ అడుగులో, ప్రతీ పాటలో పీడిత ప్రజల విముక్తి కోసం సందేశం ఉండేదని చెప్పారు. త్యాగానికి ప్రతిరూపమైన గద్దరన్న తన భార్యా, బిడ్డ, కొడుకు కోసం ఆలోచన చేయకుండా ప్రజల కోసమే పనిచేసి అమరజీవిగా నిలిచి పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రజా సంఘాల జేఏసీరాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. పుట్టుక, చావు తనది, బతుకంతా ప్రజల పక్షాన నిలబడి, కలబడి పోరాటం చేసిన గద్దర్ జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని ఆయన పేరిట స్మృతి వనాలను ఏర్పాటు చేయాలని కోరారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో గద్దర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి గద్దర్ కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ గద్దరన్నను, గద్దర్ చరిత్రను చంపాలని, రూపు మాపాలని చూస్తున్నారని, ఏ పార్టీ కోసం ఆయన తన సర్వస్వాన్ని త్యాగం చేశాడో ఆ పార్టీ నేడు గద్దర్‌ను స్మరించుకోవడం లేదని విమర్శించారు. ఈ సభలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నేత సాయిని నరేందర్, గద్దర్ కోడలు సరిత, గద్దర్ సహచరుడు సీఎల్. యాదగిరి, వివిధ ప్రజా సంఘాల నాయకులు సుంకరి భిక్షపతి, గాజుల గోవర్ధన్, పటేల్ వనజక్క, సోమా రామమూర్తి, కూనూరు రంజిత్‌గౌడ్, చుంచు రాజేందర్, కరేటి శంకర్ రావు యాదవ్, వెంగ శిరెడ్డి, రామబ్రహ్మం, నున్న అప్పారావు, తాడిశెట్టి క్రాంతికుమార్, కేడెల ప్రసాద్, మన్నె బాబురావు, బండి మొగిలి, రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న గుమ్మడి సూర్యకిరణ్, వేదికపై ప్రొఫెసర్ వెంకటనారాయణ, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, డాక్టర్ పృథ్వీరాజ్

కాజీపేట మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు

కాజీపేట, ఆగస్టు 31: కాజీపేట - హసన్‌పర్తి మధ్య రైల్వే నాలుగో రైల్వే ట్రాక్ నిర్మాణాల నేపథ్యంలో సెప్టెంబర్ 23 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అప్అండ్ డౌన్ రైలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబరు 8 వరకు, సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2 వరకు, గుంటూరు - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2 వరకు, విజయవాడ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్అండ్ డౌన్ సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 7 వరకు రద్దు చేశారు. కాజీపేట - సిర్పూర్ టౌన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 8 వరకు, బల్లార్ష - భద్రాచలం రోడ్‌ల మధ్య నడిచే సింగరేణి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ రైలు సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 8 వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నారని చెప్పారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య



కాజీపేట బాలవికాసలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కాజీపేట, ఆగస్టు 31: సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్. తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మాదిగలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కాజీపేట బాలవికాస సెంటర్‌లో శనివారం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు మైసా ఉపేందర్ అధ్యక్షత మాదిగ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మాజీ జడ్పీ చైర్మన్ డాక్టర్. ఎం.సుధీర్‌కుమార్‌లు హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా మాదిగలు అన్నిరంగాల్లో తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మాదిగల రిజర్వేషన్‌ల కోసం మాదిగ సంఘాలు చేసిన ఉద్యమాలతోనే సుప్రీంకోర్టు అనుకూల తీర్పుఇచ్చిందన్నారు. రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు మాదిగలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు బొట్ల భిక్షపతి మాదిగ, నాయకులు జనగాం నర్సింగ్, గోవింద్, నవీన్ కు మార్, వీరస్వామి, బండ శ్రీనివాస్, జన్ను మధు, గంగారపు అమృతరావు, ఆరూరి రంజిత్, పరం జ్యోతితోపాటు మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


రుద్రేశ్వరాలయంలో సినిమా యూనిట్ పూజలు

వేయిస్తంభాల ఆలయంలో సినిమా షూటింగ్

సందడి చేసిన హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 31: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సినిమా షూటింగ్ ప్రారంభమైంది. సుమారు దశాబ్దకాలం తరువాత వేయిస్తంభాల కల్యాణ మండప పనులు పూర్తయిన నేపథ్యంలో చాలా కాలం చిత్రీకరణ సందడి మొదలైంది. వరంగల్‌కు చెందిన ప్రముఖ నిర్మాత మధుర శ్రీధర్.. మాధవి ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' షూటింగ్ తొలి షెడ్యూల్ వేయిస్తంభాల ఆలయంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా ఐదు గంటలపాటు కొనసాగింది. దర్శకుడిగా సంజీవ్ వ్యవహరిస్తున్న ఈ సినిమాలో హీరోగా విక్రాంత్, హీరోయిన్‌గా చాందినీ చౌదరి నటిస్తున్నారు. హీరోయిన్ తండ్రిగా బలగం ఫేం మురళీధర్‌గౌడ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రేమ ప్రధానంగా, సెంటిమెంట్‌తోపాటు సమాజానికి మంచి సందేశాన్ని అందించే సినిమాను నిర్మిస్తున్నట్లు మధుర శ్రీధర్ చెప్పారు. హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని, తండ్రి పాత్రలపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు ఆలయంలోని రుద్రేశ్వరుడికి సినిమా యూనిట్ ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ సినిమా యూనిట్‌ను సాదరంగా స్వాగతించి పూజలు నిర్వహింపజేసిన అనంతరం ఈ సినిమా విజయవంతం కావాలని ఆశీర్వదించారు. మరో మూడు రోజులుపాటు షూటింగ్ నిర్వహిస్తామని శ్రీధర్ తెలిపారు.


షూటింగ్‌లో హీరో, హీరోయిన్

మట్టి గణపతికి జయహో

● మట్టి వినాయక విగ్రహాల వైపు జనం చూపు ● నగరంలో పెద్దఎత్తున విగ్రహాల తయారీ



హనుమకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ వస్తోంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి. ప్రతీ వీధిలో గణేషుడు కొలువుదీరనున్నాడు. ఈ నేపథ్యంలో చాలా మంది ఎకో ఫ్రెండ్లీ గణేషుడిని పూజించేందుకు మక్కువ చూపుతున్నారు. అనేక గణేష్ మండపాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఇష్టపడుతున్నారు. ఇదివరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా పూజించేవారు. చూడటానికి ఇవి ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో చాలామంది వీటినే ప్రతిష్ఠించడానికి ఆసక్తికనబరిచేవారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అందమైన విగ్రహాలను తయారు చేసి వాటికి వివిధ రంగులను జోడించి తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసిన సమయంలో అవి విషపూరితమైన కెమికల్స్‌ను విడుదల చేయడంవల్ల పర్యావరణానికి హానికలిగేది. అయితే కరోనా మహమ్మారి తర్వాత 'గో గ్రీన్.. సేవ్ లైఫ్' పేరుతో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను తయారు చేయడం.. మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించడం వంటివి మొదలు పెట్టారు. ప్రస్తుతం వాటినే ట్రెండ్‌గా సెట్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఎక్కువమంది మట్టి వినాక విగ్రహాలను పూజించేందుకు, భక్త మండళ్లు వాటినే ప్రతిష్ఠించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో మట్టి విగ్రహాలకు క్రమంగా డిమాండ్ పెరగడంతో తయారీదారులు పీవోసీ నుంచి మట్టివిగ్రహాల వైపు మళ్లుతున్నారు. ఆ మేరకు పీవోసీ విగ్రహాలతో పోటీపడేలా అంతకన్నా అందంగా ఉండేలా మట్టిగణపతులను రూపొందించి మార్కెట్‌లో విక్రయానికి పెడుతున్నారు.

జోరుగా మట్టి విగ్రహాల తయారీ

ప్రస్తుతం వరంగల్ నగరంలో పలు చోట్ల రోడ్ల పక్కన అమ్మకానికి పెట్టిన గణనాథుల విగ్రహాల్లో మట్టి విగ్రహాలే ఎక్కువగా ఉన్నాయి. పీవోసీ కన్నా మట్టి విగ్రహాలను తయారు చేయడం కొంచెం కష్టమే. అయితే పీవోసీ విగ్రహాల తయారీకయ్యే ఖర్చుతో పోల్చితే కొంత మేరకు చౌకనే. పైగా విగ్రహాల తయారీలో ఉపయోగించే ముడిసరుకు స్థానికంగానే దొరుకుతుంది. కాస్త నైపుణ్యం, సృజనాత్మకతను జోడిస్తే మట్టి విగ్రహాలను మరింత అందంగా తయారు చేయవచ్చునని చెబుతున్నారు విగ్రహ తయారీదారులు. మట్టి విగ్రహాలను పూజించాలన్నదే హిందూ సంప్రదాయం. ధార్మిక సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఇటీవలకాలంలో దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం కూడా మట్టి వినాయకులపై ఆదరణ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు చాలా మంది తయారీదారులు మట్టివిగ్రహాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మట్టి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది.

పెద్ద ఎత్తున ఆదరణ

వినాయక చవితి పండుగకు నెల రోజుల ముందుగానే చాలామంది మట్టి విగ్రహాల తయారీకి ఆర్డర్స్ ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు. బిహార్, కోల్‌కత్తా, మహారాష్ట్ర నుంచి వల వచ్చిన కుటుంబాలు ఇప్పటికీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను తయారు చేస్తుండగా.. స్థానికులు మాత్రం మట్టి విగ్రహాలను రూపొందిస్తున్నారు. వినాయక చవితికి ఇంకా ఏడు రోజులే మిగిలి ఉండడంతో క్షణం తీరిక లేకుండా రాత్రింబవళ్లు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వీటి ధరలు కూడా విగ్రహం ఎత్తును బట్టి రూ 2వేల నుంచి రూ.20వేల వరకు ఉన్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కన్నా ఒకింత తక్కువగానే ఉన్నాయి. అయితే పీవోపీ విగ్రహాల అంత ఎత్తు, ఆ రకమైన డిజైన్లలో వీటిని చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం వాటి బరువు పెరగడం, ఖర్చు కూడా అధికం కావడం.

11 ఏళ్లుగా తయారీలో..



మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయడం ఒక కుటీర పరిశ్రమలా గొట్టే శివకుమార్ కొనసాగిస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆయన 11 ఏళ్ల మట్టి విగ్రహాలనే తయారు చేసి అమ్ముతున్నాడు. విగ్రహాల తయారీకి పొలాల్లోని బంకమట్టినే వాడుతున్నాడు. ఆ మట్టిలో రాళ్లులేకుండా శుభ్రం చేసి అందులో కొంత ఇసుక కలిపి, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచుతో వీటిని తయారు చేస్తున్నాడు. విగ్రహం పటిష్ఠంగా ఉండడానికి వాటి తయారీలో స్థానికంగా దొరికే కర్రలను వినియోగిస్తున్నాడు. మట్టి విగ్రహాల తయారీ వల్ల స్థానిక మహిళలకు కూలీ దొరుకుతోంది. సుమారు 30 నుంచి 40 మంది మహిళలు వీటి తయారీలో పాలుపంచుకుంటున్నారు. వారికి రోజువారీ కూలీ చెల్లిస్తున్నాడు. జూన్ నుంచి ఆగస్టు వరకు నాలుగు నెలల పాటు వారికి చేతినిండా పని ఉంటుందని శివకుమార్ చెబుతున్నాడు. మూడు నుంచి తొమ్మిది అడుగుల ఎత్తు వరకు ఉండే ఈ విగ్రహాలను ఏటా సుమారు 150 వరకు తయారు చేసి వరంగల్ నగరంతో పాటు హైదరాబాద్ తదితర పట్టణాల్లో విక్రయిస్తున్నాడు. పీవోపీ విగ్రహాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో అత్యంత అందమైన రీతిలో వీటిని తయారు చేస్తున్నారు. విగ్రహాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వాటిని ప్రకృతిలో లభించే రంగులతోనే తీర్చిదిద్దడంతో పాటు వాటిని స్థానిక మహిళలు రూపొందించి ఎంబ్రాయిడరీ వస్త్రాలతో అలంకరించడంతో అవి మరింత అందంగా, సహసిద్ధమైన సౌందర్యంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఇవి హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ వద్దనే కాకుండా పలు ఇతర చోట్ల అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.

ఆసక్తి చూపుతున్నారు..

మురావత్ విజయకుమార్, సేల్స్‌మన్



ఏటా 150కిపైగా మట్టి విగ్రహాలను విక్రయిస్తుంటాం. మార్కెట్‌లో ట్రెండ్‌ను బట్టి సరికొత్త డిజైన్లతో రూపొందిస్తున్నాం. పూర్తిగా మట్టితో సహజసిద్ధమైన రంగులతో తయారుచేసిన ఈ విగ్రహాలను కొనుగోలు చేయడానికి యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పండగ నాటికి దాదాపు అన్ని విగ్రహాలు అమ్మకమవుతాయి. ధరలు విగ్రహం ఎత్తును బట్టి రూ.6వేల నుంచి రూ.22వేల వరకు ఉన్నాయి. విగ్రహం తేలిగ్గా ఉంటుంది. ఇద్దరు మనుషులు సునాయాసంగా మోసుకెళ్లవచ్చు.

40 అడుగుల భారీ మట్టి గణనాథుడు

వరంగల్ నగరంలో తొలిసారి 40 అడుగుల ఎత్తు భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. వరంగల్‌లోని ఎల్లమ్మబజార్‌లో మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం తయారీ దాదాపు పూర్తయింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తర్వాత అతి పెద్ద వినాయక విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించనున్నారు. శ్రీ భద్రకాళి హిందూ ఉత్సవ నిర్వహణ సమితి ఆధ్వర్యంలో ఆకుతోట సంజు సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. కమలంపై నిల్చున్న భంగిమలో ఉన్న దుర్గ గణపతి ఎంతో గంభీరంగా, అందంగా ఆకట్టుకునే రీతిలో దర్శనమియ్యనున్నారు. వినాయక చవితి రోజు భద్రకాళి ఆలయం ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు తొలిపూజ నిర్వహిస్తారు. నవరాత్రులు ఉదయం, సాయంత్రం నిత్యవిధి పూజలు, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు పూర్ణాహుతి ఉంటుంది. ఈ భారీ వినాయకుని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా గట్టిగట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు చెందిన 30 మంది సెక్యూరిటీ గార్డులు రేయింబవళ్లు ఇక్కడ కాపలాగా ఉంటారు. సమితి నిర్వాహకులు శనివారం సీపీని కలిసి పోలీసు బందోబస్తును కూడా కోరారు. నవరాత్రులు ముగిసిన తర్వాత ఉన్నచోటనే విగ్రహ నిమజ్జనం నిర్వహిస్తారు. ఫైర్ ఇంజన్ సాయంతో పాలునీళ్లతో అభిసేకిస్తారు. దీంతో విగ్రహం క్రమంగా కరిగిపోయి ఉన్నచోట నిమజ్జనం అవుతుంది.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించేందుకే..

ఆకుతోట సంజు, ఎల్లమ్మబజార్, వరంగల్

ఖైరతాబాద్‌లో భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించడం చూసిన తర్వాత వరంగల్‌లో కూడా అదే రీతిలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. పర్యావరణ పరిరక్షణ అంటే నాకు ఎంతో మక్కువ. ప్లాస్టర్ పారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టం ఎంతో కలిచివేసింది. ఇందుకు మట్టితో చేసి విగ్రహాలనే పూజించాలనే ఉద్దేశంతో వరంగల్‌లో భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటుకు సంకల్పించాను. నా స్వస్థలం ఎల్లమ్మబజార్‌లో భారీ గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. 3 నెలల కిందట విగ్రహం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. విగ్రహాన్ని ఉన్న చోటనే రాగడి మట్టి, గడ్డి, ఉసుక, కర్రలతో రూపొందిస్తున్నాం. సహజ సిద్ధంగా లభించే రంగులనే వాడుతున్నాం.

నెరవేరిన 'పీహెచ్‌డీ' కల

కేయూ క్యాంపస్, ఆగస్టు 31: ఎన్నో అవాంతరాలు, ఆటుపోట్లు, పోలీసు కేసులు, విద్యార్థులపై లాఠీ చార్జీలు, నిర్బంధాలను తట్టుకుని విద్యార్థులు చేసిన పీహెచ్‌డీ అడ్మిషన్ల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు కాకతీయ యూనివర్సిటీలో శనివారం అన్ని విభాగాలో పీహెచ్‌డీ అభ్యర్థుల అడ్మిషన్ల ప్రక్రియ సాఫీగా సాగింది. వర్సిటీలోని అన్ని విభాగాల్లో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు.. వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో తమ జాయినింగ్ రిపోర్టులను అందచేసి ధృవపత్రాలను పొందారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందడంతో అభ్యర్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

అలుపెరుగని పోరాటం

పీహెచ్‌డీ కేటగిరి-1, 2లలో సరైన నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ గతంలో కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎదుట పీహెచ్‌డీ ఆశావహులందరూ నిరవధిక నిరసనలు చేపట్టారు. అదే క్రమంలో అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు విద్యార్థుల దీక్షలను పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విద్యార్థుల పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారం అప్పట్లో రాష్ట్ర స్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు విద్యార్థులకు అండగా నిలిచారు. వర్సిటీలో విద్యార్థులు చేసిన పోరాటానికి స్పందించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు చిరకాలవాంఛ అయిన పీహెచ్‌డీ అడ్మిషన్లను ఇప్పుడు కల్పించారు. ఇందుకు రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులకు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు జోక్యంతో అప్రమత్తంగా..

రాష్ట్ర హైకోర్టులో పీహెచ్‌డీ అడ్మిషన్లపై పిల్‌ను కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి దాఖలు చేశారు. పిల్ తీర్పు రాకముందే వర్సిటీ ఉన్నతాధికారులు అప్రమత్తమై న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తతో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. భవిష్యత్తులో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా అడ్మిషన్లు పూర్తి చేశారు. అయితే హైకోర్టు దాఖలు చేసిన పిల్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన పీహెచ్‌డీ అడ్మిషన్ల వరకే వర్తిస్తుందని తెలుస్తోంది. మిగతా విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులను పిల్‌లో ఇంప్లిట్ చేయలేదని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూ సోషల్ సైన్స్ విభాగంలో అత్యధికంగా 140 మందికి అడ్మిషన్లు కల్పించారు. వీరిలో ఎకనామిక్స్‌లో-7, హిస్టరీలో-21, టూరిజంలో-13, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో-22, హెచ్‌ఆర్‌ఎంలో-24, రాజనీతిశాస్త్రంలో- 32, సోషియాలజీలో- 12, సోషల్ వర్క్స్‌లో 14 మంది అభ్యర్థులు అడ్మిషన్లు పొందారు. అలాగే న్యాయశాస్త్రంలో 6, ఆర్ట్స్ విభాగంలో ఇంగ్లీష్‌లో-3, ఫార్మసీ విభాగంలో- 15, ఇంజనీరింగ్ విభాగంలోని ఈసీఈలో-7, సివిల్‌లో-1, మెకానికల్‌లో-1 చొప్పున అభ్యర్థులు అడ్మిషన్లు పొందారు. వీటితో పాటు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 15, లైఫ్‌సైన్స్ విభాగాల్లోనూ అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించారు.

వర్సిటీ భూమి కోసం పోరాటం

తీవ్ర చర్చనీయాంశంగా 'ఆంధ్రజ్యోతి' కథనం ● కదన రంగంలోకి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 31: కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూ వివాదాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి దక్కించుకోవాలని వర్సిటీ ఉద్యోగ, విద్యార్థి, మేధావి వర్గాలు భావిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రచ్చకెక్కుతున్న కేయూ భూ వివాదం 'కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. 1989లో అప్పటి తాత్కాలిక అవసరాల కోసం వర్సిటీ అధికారులను ఒప్పించి పోలీసు ట్రైనింగ్ కోసం 2 ఎకరాల స్థలాన్ని జిల్లా పోలీసుశాఖకు మాట మీద ఉచితంగా అప్పగించారు. అదే అదునుగా భావించిన పోలీసు అధికారులు వర్సిటీ భూముల్లో క్రమ క్రమంగా పాగా వేశారు. సీఆర్‌పీఎఫ్ క్యాంపుతో పాటు కేయూ పోలీస్‌స్టేషన్, జిల్లా పోలీసు అధికారుల ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. అంతటితో అగకుండా పోలీస్ ట్రైనింగ్ అవసరాల కోసమంటూ మరో 7ఎకరాల వర్సిటీ భూమికి కంచె వేశారు. వర్సిటీ అధికారులు వర్సిటీ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తామంటే తమకు ప్రత్యేకంగా గేటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసలే వర్సిటీ భూమి అన్యాక్రాంతమవుతోందని విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. సందెట్లో సడేమియా అన్నట్లు పోలీసు అధికారులు అందినకాడికి వర్సిటీ భూములను గుట్టుచప్పుడు కాకుండా చక్కబెట్టుకునే ప్రయత్నాలకు దిగారు. దీన్ని గుర్తించిన వర్సిటీ ఉన్నతాధికారులు పోలీసులకు అసలు ఎంత భూమి కేటాయించారు? ఏ ప్రతిపాదికన ఇచ్చారనే విషయంపై దృష్టి సారించారు. అదే విషయాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లగా, సీఎం రేవంత్‌తో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహాయంతో తిరిగి భూమిని తప్పకుండా దక్కించుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్నారని సమాచారం.

ఇదిలా ఉండగా, వర్సిటీకి చెందిన దాదాపు 10 ఎకరాల భూమిని పోలీసుశాఖ వాడుకుంటోందని లెక్కలు తీశారు. దీని విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వర్సిటీలో పోలీసుశాఖకు కేటాయించిన ఆయా భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటేనే భవిష్యత్తు తరాలకు వర్సిటీ సేవలందిస్తుందని చెబుతున్నారు. కాగా, వర్సిటీ ఉద్యోగ. మేధావి, విద్యార్థివర్గాలన్నీ ఏకమై జేఏసీగా ఏర్పడి వర్సిటీ భూముల రక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలనే నిర్ణయానికి వస్తున్నట్లు తెలిసింది. అయితే పోలీసు అధికారులు మాత్రం తమకే భూమి దక్కుతుందనే భరోసాతో ఉన్నారని తెలుస్తోంది.

ఎన్ఎస్ఎస్ విభాగానికి ఇవ్వాలి..

కేయూ చెందిన సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు ఇచ్చిన భూమిని వర్సిటీలోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగానికి ఇవ్వాలని ఎంఎస్ఎఫ్ నేతలు శనివారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని అందచేసి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌ను తన చాంబర్‌లో కలిసి వర్సిటీ ఎన్ఎస్ఎస్‌కు సరైన సదుపాయాలు లేవని, ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, జిల్లా నాయకులు మంద భాస్కర్, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, అజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎంఎస్ఎఫ్ నేతలు

వర్సిటీలో అధికారుల బృందం తనిఖీలు

మాజీ వర్సిటీ ఉన్నతాధికారుల ఫిర్యాదులపై ఆరా

కేయూక్యాంపస్, ఆగస్టు 31: కాకతీయ యూనివర్సిటీలో శనివారం విజిలెన్స్, రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. 5 శాఖల ఉన్నతాధికారుల ప్రత్యేక బృందంగా ఏర్పడి వర్సిటీలో కలియతిరిగి వర్సిటీ మాజీ ఉన్నతాధికారులపై వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. వర్సిటీలోని భూములన్నీ స్వయంగా తిరిగి పరిశీలించారు. వర్సిటీ భూముల సర్వే నెంబర్లలో ఉన్న భూమి ఎంత? ఎంత అన్యాక్రాంతమైందనే విషయంపై పరిశీలన చేశారు. వర్సిటీ భూముల హద్దులను పరిశీలించారు. భూమి ఆక్రమణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్సిటీ మాజీ ఉన్నతాధికారుల పాత్రను ప్రత్యేకంగా నోట్ చేసుకున్నారు. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారు తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, ఇతరులకు లబ్ధి చేకూర్చే అంశాలన్నీ ప్రస్తావించారు. తాజా మాజీ వర్సిటీ బాస్‌తో పాటు ఆయన హయాంలో పనిచేసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ బృందంలో ఇద్దరు జిల్లా విజిలెన్స్ అధికారులు, ఇద్దరు మునిసిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ నుంచి ఒక్కరు, తహసీల్దార్‌తో పాటు వర్సిటీ బిల్డింగ్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పొంగుతున్న వాగులు.. వంకలు



పస్రా-వెంగ్లాపూర్ మధ్య బాంబుల ఒర్రె వద్ద రహదారిపై వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

తాడ్వాయి, ఆగస్టు 31: మండల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తళ్లు పడుతున్నాయి. తాడ్వాయి నుంచి మేడారం, కాటాపూర్ వైపు, పస్రా-తాడ్వాయి మధ్యలో భారీ చెట్లు రోడ్లకు అడ్డంగా కూలిపోయాయి. జనగలంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏటూరునాగారం-హనుమకొండ వైపు వాహనాలు నిలిచిపోయాయి. తాడ్వాయి-పస్రా మధ్య కూలిపోయిన చెట్లను పోలీసులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. సాయంత్రం జనగలంచవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఏటూరు నాగారం వైపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే భారీ వర్షాలతో పత్తి, వరి పంటలు నీట మునిగాయి. పలు గ్రామాల్లో వరదల ఉధృతికి పంట పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. దీంతో రైతులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. భారీ వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనగలంచ, వెంగళాపూర్-పస్రా మధ్య రోడ్లపై వరద ప్రవాహం అధికంగా ఉన్న నేపథ్యంలో వాహన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు. వాజేడు, పేరూరు, వెంకటాపురం(నూగూరు), ఛత్తీస్‌గఢ్‌లోని భూపాల పట్నం వెళ్లేవారు గుడెప్పాడ్, పరకాల, భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్ మీదుగా వెళ్లాలని అన్నారు.

● ఏటూరునాగారం: భారీ వర్షాలకు మండలంలోని షాపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిలో శనివారం సాయంత్రం వృక్షం నేలమట్టమైంది. తహసీల్దార్ జగదీశ్వర్‌కు గ్రామస్థలు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి ఆయన అక్కడికి చేరుకొని వృక్షాన్ని తొలగింపజేశారు. అలాగే వర్షాలకు మండలంలోని జంపన్నవాగు వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. జీడివాగు, దెయ్యాలవాగుల ఉధృతి క్రమ క్రమంగా పెరుగుతోంది. లోతట్టు ప్రాంతాలల్లోని ఎస్సీ, ఎస్టీ, ఓడవాడ, పద్మశాలికాలనీల్లోని ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది.

● కాటారం: మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమ యాయి. భారీ వర్షంతో పలు చోట్ల పంట పొలాల్లోకి వరద నీరు చేరి రైతాంగానికి నష్టం వాటిల్లింది. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గం రాజు పెంకుటిల్లు వర్షానికి కుప్పకూలగా బాధిత కుటుంబం ఎవరూ అందులో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వర్షంతో వరద ప్రవాహానికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేలల్లోకి వరద నీరు చేరింది. మల్లారం పెద్దవాగు ఉప్పొంగడంతో దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలో పత్తి చేలల్లోకి వరద నీరు చేరడంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో అన్ని చెరువులు మరోసారి మత్తళ్లు దుముకుతున్నాయి. పంటలు నష్టపోయిన, ఇల్లు కూలిపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

● వెంకటాపురం(నూగూరు): మండలంలోని మొర్రవానిగూడెం గ్రామంలో శుక్రవారం కురిసిన వర్షానికి పూరిల్లు కూలిపోయింది. గ్రామంలోని మల్లమ్మకు చెందిన ఇల్లు శుక్ర వారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయిందని అన్నారు. ఈవిషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్సీమల్లిగూడెంలో భారీ తుమ్మచెట్టు విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలి రోడ్డుకు అడ్డంగా పడింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న తుమ్మచెట్టు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

● మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, చిన్న తూండ్ల, కొయ్యూర్‌తో పాటు పలు గ్రామాల్లో సుమారు గంట పాటు వర్షం కురిసింది. దీంతో పత్తి, వరి పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల తాడిచర్ల వద్ద మానేరులో ప్రవాహం పెరిగింది. వర్షం వల్ల తాడిచర్ల, కొయ్యూర్ ప్రధాన రహదారి బురదమయంగా మారింది. మల్లారం వద్ద ఆరె వాగు ప్రవాహం పెరిగింది.

● మంగపేట: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులు, ఈదరు గాలులతో వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు నిండిపోయాయి. వాగులు, ఒర్రెలు పరవళ్లు తొక్కాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో వరి చేలు, ఇతర పంటలు కొంత వరకు మునిగాయి.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కాకతీయఖని, ఆగస్టు 31: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కురుస్తున్న వర్షం ప్రభావంతో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్- 2,3లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. క్వారీల్లో వర్షపు నీరు నిలవడంతో కోల్ ఆపరేషన్, ఓవర్ బర్డెన్(ఓబీ) పనులు శనివారం ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారులు బురుదమ యం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి ఉండగా బొగ్గును వెలికి తీయడం సాధ్యపడలేదు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-2,3 గనుల ద్వారా రోజుకు 9వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉందని, శనివారం కురిసిన వర్షం కారణంగా ఒక్క టన్ను బొగ్గును కూడా వెలికి తీయలేదని సింగరేణి అధికారులు చెబుతున్నారు. దీంతో ఓసీ-2,3ల ద్వారా సింగరేణి సంస్థకు సుమారు రూ. 3 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి



మహేష్ మృతదేహం

తాడ్వాయి, ఆగస్టు 31: మండలంలోని జంపన్న వాగు సమీపంలో పిడుగు పాటుకు పశువుల కాపరి వృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం జరి గింది. నార్లాపూర్ గ్రామానికి చెందిన మహేష్(30) గేదెలను మేపుతూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో జంపన్నవాగు సమీపంలో గేదెలను మేపుతుండగా భారీ వర్షం కురువడంతో చెట్టు కిందికి వెళ్లి నిల్చున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా అతడిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈసంఘ టనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బొగత సందర్శన నిలిపివేత

వాజేడు, ఆగస్టు 31: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాతం సందర్శనను ఆదివారం నుంచి నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యాటకుల రక్షణార్థం సందర్శనకు అను మతిని నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం పునరుద్ధరి స్తామని, జలపాతం సందర్శనకు రావాలనుకొనే వారు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని సూచించారు.

ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సీతక్క

ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం సహాయక చర్యలకు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కోరారు. ఈమేరకు శనివారం రాత్రి ఓ ప్రకటన జారీ చేశారు. విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 48 గంటలు జిల్లా వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



అలుగు దుముకుతున్న కాటారం మండలం చింతకాని గూడెపు చెరువు



మల్హర్ మండలం మల్లారం వద్ద ప్రవహిస్తున్న ఆరెవాగు



మేడారం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగు

ఉత్తమ బోధనతోనే విశేష గుర్తింపు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 31: ఉత్తమ బోధనతోనే ఉపాధ్యా యులకు విశేష గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణరావు అన్నారు. మండ లం లోని గొల్లబుద్దారం గ్రామంలో జడ్పీహెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయుడు మందల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల బదిలీల్లో ఆ పాఠశాల నుంచి బయటికి వెళ్లిన, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఉపాధ్యా యులు ఎక్కడ పనిచేసినా విద్యార్థు లకు మంచి బోధనను అందించాలని అన్నారు. సమయపాలన పాటించి వారి మన్ననలు పొందాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు పదవి విరమణకార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలొద్దు

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మల్చూర్ నాయక్

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 31: ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆ శాఖ సిబ్బందికి, కేబుల్, నెట్ యజమానులకు టీజీఎన్‌పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ మల్చూర్‌నాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి పట్టణంలో యూనిక్‌పోల్స్ నంబరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు కేబుళ్లను విద్యుత్ స్తంభాలకు జాగ్రత్తగా అమర్చాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ సర్వీసులకు అవసరమైన కనెక్షన్లను వెంటనే మంజూరు చేయాలని, మాన్యువల్ బిల్లింగ్‌ను తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17 నుంచి నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో గృహజ్యోతి లబ్ధిపొందని వారికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సెల్ఫ్ డిఫెన్స్ అమలు చేయాలి

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 31: రాష్ట్రవ్యాప్తంగా అమ్మాయిలపై అత్యాచారాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ అమలు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. ములుగులో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో సెల్ఫ్‌డిఫెన్స్ ఏర్పాటు చేయాలని ఇటీవల ములుగు పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిష్కారం కింద (సెల్ఫ్‌డిఫెన్స్) 5,748 పాఠశాల లను ఎంపిక చేసిందన్నారు. ములుగు జిల్లాలో 59 పాఠశాలలను ఎంపిక చేయడం సంతోషకర విషయమని అన్నారు. సెల్ఫ్‌డిఫెన్స్‌ను అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అమలు చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో నాయకులు దుగ్గినేని భాను, ఇనుముల మహేష్, చాతరాజు విక్రాంత్, గుండ్ల ప్రశాంత్, దిలీప్ పాల్గొన్నారు.

చింతకానిలో పిచ్చి కుక్క స్వైర విహారం

కాటారం, ఆగస్టు 31: మండలంలోని చింతకాని గ్రామపంచాయతీ పరిధిలో శనివారం సాయంత్రం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పశువులను, ఓ బాలుడిని గాయపర్చింది. లోకేష్ అనే బాలుడి పిరుదులపై కుక్క కరిచింది. గ్రామంలో అటు ఇటూ పరుగెత్తుతూ తోట రాజయ్యకు చెందిన గేదె, పొట్ట లచ్చయ్యకు చెందిన మూడు లేగదూడలు, పొట్ట చిరంజీవికి చెందిన రెండు ఎద్దులు, దహగం కిష్టయ్యకు చెందిన రెండు లేగదూడలు, ఆత్కూరి సారయ్య, జమాల్, నాగరాజులకు చెందిన ఒక్కో దూడ, తోట సుమన్‌కు చెందిన మేకపై కుక్క దాడి చేసి గాయపర్చింది. దీంతో గ్రామస్థులు కుక్క వెంటపడి కర్రలతో కొట్టి చంపారు. గాయపడ్డ పశువులకు వైద్యం అందించాలని వైద్యులను కోరగా వెటర్నరీ సెంటర్‌కు తీసుకురావాలని చెప్పడంతో వాటి యజమానులు ప్రైవేట్ వ్యక్తికి డబ్బులిచ్చి వైద్యం చేయించారు. బాలుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్ చేయించారు. మేక తలను కొరకడంతో చనిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 31: వాతావరణశాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమావేశమయ్యారు. భారీ వర్ష సూచనపై సమీక్షించారు. రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసి అత్యవసర సేవలకు స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలోని పలిమెల, మహాముత్తారం మండలాల లోతట్టు ప్రాంతాలున్నాయని, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి వరదలు సంభవించినప్పుడు లోలెవల్ కల్వర్టులు, నీరు చేరిన రహదారులు దాటకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. పశువులను మేతకు బయటకు వదలకుండా ఇంటి వద్దనే ఉంచాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు రైతులు వ్యవసాయ పనులకు వెళ్లొదద్దని సూచించారు.

అంకితభావంతో పనిచేస్తేనే మన్ననలు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 31: అంకితభావంతో పనిచేస్తేనే ఏ ఉద్యోగి అయినా మన్ననలు పొందుతారని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వెంకటేశ్వర్లు అంకితభావం, నిబద్ధత గల వ్యక్తిగా గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు వీడ్కోలు సభ కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దంపతులను ఎమ్మెల్యే, కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అదనపు కలెక్టర్ హోదాలో జిల్లా ప్రజలకు వెంకటేశ్వర్లు ఎనలేని సేవలు అందించారన్నారు. వరదలు, ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రెవెన్యూ శాఖలో సుదీర్ఘ సేవలు అందించి విశేష గుర్తింపు పొందారని అన్నారు. ఈకార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈఈ సేవలు ప్రశంసనీయం

నీటిపారుదల శాఖ భూపాలపల్లి డివిజన్ ఈఈ గా విధులు నిర్వర్తించిన వెంకటేశ్వర్లు సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వెంకటేశర్లు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈసందర్భంగా ఈఈనిసన్మానించారు.

నేటి నుంచి 'స్వచ్ఛ పక్వాడా'

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 31: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని ప్రభుత్వాలు చేపడుతున్నాయి. ఇది జిల్లాలో ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఈ పక్షోత్సవాలను చేపడుతోంది.

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : దామోదర్

వాజేడు, ఆగస్టు 31: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వాడబలిజ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్రా దామోదర్ డిమాండ్ చేశారు. మండలంలోని రాంపురంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో పుట్టిన గోదావరి అక్కడి నుంచి తెలంగాణ రాష్ట్రంలో చొరబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిసే వరకు 1450 కిలోమీటర్ల మేర ఉన్న గ్రామాల్లో వేలాది కుటుంబాలు, లక్షలాది సంఖ్యలో వాడబలిజ కులస్థులు ఉన్నారన్నారు. బీసీ-ఏకు చెందిన వాడబలిజలకు కార్పొరేషన్ ద్వారా రుణాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొల్లె నరేష్‌కు నియమాక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గార నాగార్జున, చింతూరి రమేష్, కొప్పుల రమణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

మొగుళ్లపల్లి, ఆగస్టు 31: మండలంలోని పిడిసిల్ల గ్రామంలోని ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వేణు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తే చర్యలు తప్పవని అన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

● చిట్యాల : మండలంలోని జడల్‌పేట శివారు గాంధీనగర్ దళిత కాలనీ ప్రజలకు మం డల అధికారులు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దళితులను వ్యక్తిగతంగా దూషించినా, దాడులకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్ల రాజు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● రేగొండ : మండలంలోని పోచంపల్లి గ్రామంలో తహసీల్దార్ శ్వేతారావు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సై సందీప్‌కుమార్ మాట్లాడుతూ కులం పేరుతో ఎవరైనా దూషిస్తే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జూపాక నరేష్, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 31 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం బ్యారేజీలోకి 1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 2.60 మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

చిట్యాల, ఆగస్టు 31: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బండి శ్రీనివాస్ (36) కొంత కాలంగా అతిగా మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులతో తరచుగా గొడవపడుతున్నాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించాడు. భార్య రమ తెల్లవారువారుజామున బాత్ రూంకు వెళ్ల చూడగా అతడు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి : డీఎంహెచ్‌వో

ఏటూరునాగారం, ఆగస్టు 31: ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఓ ఆస్పత్రిలో మోతాదుకు మించి యాంటీబయోటిక్స్ ఇవ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడం మండిపడ్డారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కాలనీలో లార్వా సర్వే నిర్వహించారు. దోమల నివారణ చర్యలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రొయ్యూరు సబ్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన వెంట డాక్టర్ సుమలత, డాక్టర్ అన్విత తదితరులు ఉన్నారు.

మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటు పూర్తి చేయాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 31: పది రోజుల్లో మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.సంపత్‌రావు నిర్వాహకులకు సూచించారు. ములుగులోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మహిళాశక్తి క్యాంటీన్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. చింతలపల్లి గ్రామానికి చెందిన వెలుగుజ్యోతి గ్రామైక్య సంఘం, వర్షిత సంఘం సభ్యురాలైన ఎనగందుల విజయను క్యాంటీన్ ఏర్పాటుకు గుర్తించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించేలా చూడాలని సంపత్‌రావు సూచించారు. క్యాంటీన్ ఏర్పాటుకు స్త్రీనిధి నుంచి రూ.లక్షా20వేలు, సీఐఎఫ్ నుంచి రూ.లక్ష రుణం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏపీడీ బాలస్వామి, ఆస్పత్రి సూప రింటెండెంట్ జగదీశ్, డీపీఎంలు సతీష్, గోవింద్‌చౌహాన్, ఏపీఎం పాషా, సీసీలు విజయ, చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి : బీజేపీ

కాటారం, ఆగస్టు 31: బీజేపీ కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదుపై దృష్టిపెట్టి సాంస్థాగతంగా బలోపేతం కావాలని, తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని ఆ పార్టీ మంథని నియోజకవర్గ కన్వీనర్ మల్కా మోహన్‌రావు, రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. మోహన్‌రావు, నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి పల్లెలో అత్యధిక సభ్యత్వం నమోదు చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ సముచితస్థానం దొరుకుతుందన్నారు. సభ్యత్వ నమోదు మండల కన్వీనర్, కో-కన్వీనర్‌గా మంత్రి సునీల్, వేణునాయక్, శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పూసాల రాజేంద్రప్రసాద్, దుర్గం తిరుపతి, పిల్లమర్రి సంపత్, పాగె రంజిత్‌కుమార్, హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత

వెంకకటాపూర్(రామప్ప), ఆగస్టు 31 : గణేష్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మండల వ్యాప్తంగా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగను ప్రజలు ప్రాశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. పోలీసు శాఖ రూపొందించిన హెచ్‌టీటీపీఎస్://పోలీస్‌పోర్టల్.టీఎస్‌పోలీస్.గో.ఇన్ వెబ్‌సైట్‌లో మండపం ప్రదేశం, వివరాలు, విగ్రహం, మండపం ఎత్తు, పోలీస్ స్టేషన్, నిమజ్జన ప్రదేశం తదితర సమాచారం పొందుపర్చుచాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు.

ఆదివాసీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 31: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివాసీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సొంది వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంఘాల ఉద్యమ పోరాట ఫలితంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని అన్నారు. విద్యార్థులకు వసతిగృహం సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, పాత సబ్‌జైలు భవనాన్ని తాత్కాలిక వసతిగృహంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు రేగ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలు పాత పద్ధతిలో నిర్వహించాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 31: మత్స్యశాఖలో జీవో 74 ప్రకారం కొత్త సొసైటీలు, సభ్యత్వాలు పాతపద్ధతిలో నిర్వహించాలని డీఎఫ్‌సీఎస్ ములుగు జిల్లా చైర్మన్ సాధు రఘు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి సభ్యుడికి రేషన్‌కార్డు, కులం, నివాస ధ్రువీకరణ, పంచాయతీ కార్యదర్శి నుంచి సర్టిఫికెట్ జతపరచాలని ఇటీవల మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక జీవో ఇవ్వడంతో మత్స్యకారులకు భారం పెరుగుతుందని తెలిపారు. ఆ సర్టిఫికెట్లను రద్దుచేసి జీవో 74ప్రకారం పాతపద్ధతిని సవరించాలని కోరారు. అదేవిధంగా వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలు, రొయ్యల పంపిణీని వేగవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో రాజుపేట మాజీ సర్పంచ్ మృతి



సాయన్న (ఫైల్)

మంగపేట, ఆగస్టు 31: మండలంలోని రాజుపేట మాజీ సర్పంచ్ బొనుగు సాయన్న యాదవ్ (67) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఇటీవల ఆయనకు గుండె ఆపరేషన్ అయ్యిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తిరిగి ఆయన అస్వస్థతకు గురికాగా హనుకొండలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించామని, డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఇంటికి వచ్చేందుకు వాహనం ఎక్కుతుండగా హఠాత్తుగా గుండె నొప్పి వచ్చి మృతి చెందారని పేర్కొన్నారు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, కుమారులు వెంకట రామారావు, సతీష్, జగన్మోహన్ ఉన్నారు. కాంగ్రెస్‌లో కొనసాగిన సాయన్న 1988-92 కాలంలో సర్పంచ్‌గా పని చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయన్న మృతదేహాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీల నాయకులు, కులసంఘాల నేతలు సందర్శించి నివాళులర్పించారు.

మాదక ద్రవ్యాలతో యువత ఎదుగుదలకు గొడ్డలిపెట్టు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 31: మత్తు, మాదకద్రవ్యాల వినియోగం యువత ఎదుగుదలకు గొడ్డలిపెట్టు అని సహాయ కార్మిక అధికారి వినోద అన్నారు. ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజం ఎంత నాగరికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజ వినాశనం కూడా అంతే వేగంతో మత్తు, మాదకద్రవ్యాల రూపంలో పెరిగిపోతుందని అన్నారు. యువత సత్ప్రవర్తనతో ఉంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఎంచుకున్న లక్ష్యంవైపు ఎదగాలన్నారు. సీడీపీవో శిరీష మాట్లాడుతూ యువత క్రమశిక్షణ కలిగి ఉండి మంచి జీవితాన్ని పొందాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల మనిషి శారీరకంగా తాత్కాలికమైన శక్తిని, మానసికంగా ఉద్రేకాన్ని పొందినప్పటికీ దాని ప్రభుత్వం తగ్గిన తరువాత మతిమరుపు, నరాల బలహీనమై కాలు, చేతుల్లో పట్టు కోల్పోవడం, కొన్ని సందర్భాల్లో విచక్షణ కోల్పోవడం, దాడులకు పాల్పడడం, హత్యలు చేసే పరిస్థితికి దిగజారడం వంటి సమస్యలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత,బాలల పరిరక్షణ విభాగం మండల ఇన్‌చార్జి, కౌన్సిలర్ సంధ్య, బాలల పరిరక్షణ విభాగం అధికారి హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు, డీసీపీయూ సిబ్బంది సుమన్, రాజు, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ ఎం.రజిని, సూపర్‌వైజర్ విక్రమ్ పాల్గొన్నారు.

దోపిడీ ఘటనపై నాలుగు పోలీసు బృందాలతో విచారణ

కాటారం, ఆగస్టు 31: మండలంలోని బస్వాపూర్‌లో మూడు రోజుల క్రితం పగడాల తిరుపతి ఇంట్లో జరిగిన దోపిడీ దొంగల బీభత్సం సంఘటనపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు దొంగలు మంకీ క్యాపులు ధరించి తిరుపతి దంపతులను కొడుతూ కత్తితో గాయపర్చి రూ.లక్ష, 5తులాల బంగారం, బైక్‌ను ఎత్తుకెళ్లడం సంచలనం సృష్టించింది. దీంతో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు నేతృత్వంలో పోలీసు అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాటారం, మహాముత్తారం, కొయ్యూరు ఎస్సైలు అభినవ్, మహేందర్, నరేష్, సీసీఎస్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నారు.

ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ప్రకాశ్‌రెడ్డి సన్మానిస్తున్న నేతలు

మల్హర్, ఆగస్టు 31 : తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్వగ్రామం వల్లెంకుంటకు శనివారం వచ్చిన ఆయన్ను ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లకావత్ సమేందర్‌తో పాటు నాయకులు సన్మానించారు. ఆయనతో పాటు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అయిత రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, మాజీ జడ్పీటీసీ కోమలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగిడి శ్రీనివాస్, లకావత్ తిరుపతి, ఖలీమోద్దిన్, కొండూరి మమత, ఎడ్ల రాము, గుంటి రామచంద్రం, మహేష్, రమేష్, బాపు, లక్ష్మీనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.